ఇరుకు గదిలో గ్రంథాలయం

గ్రంథాలయాలు.. విజ్ఞానానికి నిలయాలు. నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానం పెంచుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రసంగాలు చేస్తుంటారు. అయితే గ్రంథాలయాల్లో కనీస సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. కొన్ని చోట్ల గదుల కొరత ఉన్నా పట్టించుకోవడం లేదు. అమరాపురం మండలంలో ఇరుకు గదిలోనే పోటీ పరీక్షలకు యువత సిద్ధమవుతున్నారు. అయినా అధికారుల్లో చలనం కనిపించడం లేదు.

- ఇబ్బందులు పడుతున్న పాఠకులు
- నూతన భవనం నిర్మించడంలో నిర్లక్ష్యం
- కూటమి ప్రభుత్వంలో కనిపించని అభివృద్ధి


అమరాపురంలోని శాఖ గ్రంథాలయం

అమరాపురం: మండల కేంద్రంలోని గ్రంథాలయ భవనం ఇరుకుగా ఉండటంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత 45 ఏళ్ల క్రితం గ్రామానికి తాగునీరు అందించే వాటర్ ట్యాంకుపై తాత్కాలికంగా గది నిర్మించి, అందులో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కూడా అదే గదిలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. అప్పట్లో మూడు వేల జనాభా ఉన్న అమరాపురం పంచాయతీ జనాభా ప్రస్తుతం అధికంగా పెరిగింది. రోజూ పాఠకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో గ్రంథాలయానికి వెళ్తున్నారు. అయితే అక్కడ ఉన్న ఒక గది పుస్తకాలు, నవలలు, వివిధ పోటీ పరీక్షల పుస్తకాలు పేర్చడానికి, గ్రంథాలయ అధికారి కుర్చోవడానికి సరిపోతుంది. నిత్యం 100 మందికిపైగా పాఠకులు గ్రంథాలయానికి వెళ్తుండగా.. గదిలో కేవలం 10 మంది కుర్చోవడానికి అవకాశం ఉంది. మిగతా వారు బయటి నిలబడలేక వెనుతిరుగుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని గ్రంథాలయానికి కొత్త భవనం మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రంథాలయానికి వెళ్లాలంటే ఇబ్బంది



నేను బీఏ, బీఈడీ పూర్తి చేశాను. మాది పేద కుటుంబం. పట్టణాల్లో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్లకు వెళ్లడానికి ఆర్థిక స్తోమత లేదు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు స్థానిక గ్రంథాలయాన్ని ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ఉన్న పోటీ పరీక్షల పుస్తకాలు చదవాలంటే కుర్చోవడానికి స్థలం లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని పాఠకుల సౌకర్యార్థం గదులు నిర్మించాలి. – నాగరాజు, అమరాపురం

నూతన భవనం నిర్మించాలి



అమరాపురం గ్రంథాలయం ఇరుకుగా ఉంది. జనాభా పెరగడంతో ఎక్కువ మంది గ్రంథాలయానికి వస్తున్నారు. పాఠకుల కోసం నూతన భవనం నిర్మించాలి. నిరుద్యోగులు, పాఠకుల కష్టాలను గుర్తించి పేదలు సేవలను ఉపయోగించుకేలా చూడాలి. కొత్త భవనం నిర్మించి అందరూ సేవలను వినియోగించుకునేలా చూడాలి.
– నారాయణ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు, అమరాపురం

సదుపాయాలు కల్పించాలి



మండలంలో 55 వేలకు పైగా జనాభా ఉంది. ఒకే గ్రంథాలయం ఉంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగులు అమరాపురానికి రావాల్సిందే. స్థానిక గ్రంథాలయంలో సౌకర్యాలు లేవు. పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకోవడానికి కనీసం స్థలం లేదు. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలి. వేసవిలో విద్యార్థులు మెట్లపై కూర్చొని, చదువుకుంటున్నారు. – యోగేష్, నిరుద్యోగి, అమరాపురం మండలం

గుండెపోటుతో విద్యార్థిని మృతి


మైథిలి (ఫైల్)

పావగడ: పట్టణంలోని వై.ఈ రంగయ్య శెట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ బీకాం విద్యార్థిని మైథిలి (18) గుండెపోటుతో మృతి చెందింది. మధుగిరి తాలూకా మిడిగేశి గ్రామానికి చెందిన మైథిలి కళాశాల ముగించుకుని శనివారం పట్టణం వైపు వస్తుండగా చళ్లికెరె క్రాస్ వద్ద తీవ్ర అస్వస్థతకు గురై కిందకు పడిపోయింది. హుటాహుటిన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కన్ను మూసింది. ఆస్పత్రిలోని మార్చురీలో ఉన్న మైథిలి మృతదేహాన్ని చూసిన తోటి విద్యార్థులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. ఇంటికి చేరుకోవాల్సిన మైథిలి మృతి చెందడం దురదృష్టకరమని అధ్యాపక బృందం సంతాపం తెలిపారు.

విద్యుత్ ఏఈగా నాగరాజు



అగళి: మండల విద్యుత్ శాఖ ఏఈగా నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని రైతులు, వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తానని తెలిపారు.

ఎస్టీలకు గోకులం షెడ్లు ఇవ్వరా...?


మాట్లాడుతున్న ఎంపీడీఓ నరేంద్ర

సోమందేపల్లి: మండలంలోని ఎస్టీలకు గోకులం షెడ్లు మంజూరు చేయలేదని నాగినాయని చెరువు సర్పంచ్ అంజి నాయక్ ఆరోపించారు. శనివారం ఎంపీపీ గంగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రతి పాదనలు పంపామని త్వరలో గోకులం షెడ్లు మంజూరు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారిందని వినియోగంలోకి తీసుకురావాలని సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. బ్రాహ్మణపల్లిలో దీర్ఘకాలంగా ఉన్న విద్యుత్ సమస్య పరిష్కరించాలని సర్పంచ్ జిలాన్ ఖాన్ కోరారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరేంద్ర మాట్లాడుతూ సభ్యులు ప్రస్తావించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలిపారు. మండలంలోని తుంగోడు, వెలిదడకల, నడింపల్లి గ్రామాల మీదుగా రైల్వే లైన్ కోసం భూసేకరణ రెండవ దఫా చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రెడ్డి శేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సజావుగా మండల మీట్

రొద్దం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం ప్రశాంతంగా జరిగింది. మండల అధ్యక్షురాలు రామాంజనమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటల ప్రారంభించారు. మండలంలో నెలకొన్న పలు సమస్యలపై సమావేశంలో చర్చించారు. ఉపాధి, పంచాయతీ రాజ్, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసీడీఎస్, హౌసింగ్, ఆర్టీసీ తదితర శాఖలపై చర్చించారు. ఎక్కడైనా గ్రామాల్లో సమస్యలుంటే నివేదికలు పంపాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మావతి, తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ రామ్‌కుమార్, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

శృంగేరి పీఠాధిపతికి స్వాగతం

హిందూపురం: హిందూపురం గాయిత్రీ ఆలయానికి విచ్చేసిన శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ స్వామికి శనివారం రాత్రి భక్తులు ఘన స్వాగతం పలికారు. స్వామిజీ చంద్రమౌళేశ్వరాలయంలో జరిగిన ప్రత్యేక పూజలకు హాజరయ్యారు. స్వామిజీ ఆదివారం పులమతి రోడ్డులో రాజరాజేశ్వరీదేవి ఆలయంలో జరిగే ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కుంభాభిషేకానికి హాజరవుతారని బ్రహ్మణసేవా ట్రస్టు సభ్యులు తెలియజేశారు.

క్లుప్తంగా

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి


నారనాగేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నరేంద్ర

రొద్దం: గ్రామాల్లో ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ నరేంద్ర అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అన్నదమ్ముల్లాగా, ప్రశాంతంగా జీవించాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఎవరైనా గొడవలు చేసినా, అసాంఘిక కార్యకలాపాల జోలికెళ్లినా చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలు, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- రూ.20,400 నగదు స్వాధీనం


అరెస్ట్ చేసిన వారితో సీఐ రాజకుమార్ సిబ్బంది

అమరాపురం: కె.శివరం గ్రామ పంచాయతీ పరిధిలోని కె.గొల్లహట్టి గ్రామ పొలిమేరలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మడకశిర రూరల్ సీఐ.రాజ్‌కుమార్ అమరాపురం పోలీస్ స్టేషన్ సిబ్బందితో కలసి జూద స్థావరంపై దాడి చేశారు. పది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.20,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట, కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐరామంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి సర్వేపై అవగాహన

గోరంట్ల: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్ శృతి ఆధ్వర్యంలో ఆశా వర్కర్లకు కుష్టు వ్యాధి సర్వేపై అవగాహన కల్పించారు. ఈనెల 20 నుంచి ఫిబ్రవరి రెండో తేదీ వరకు వందశాతం కుష్టు రోగులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నట్లు డాక్టర్ శృతి తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రమణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయం ఎదుట మహిళల పడిగాపులు


ఆర్డీఓ కోసం గేటు ముందు ఎదురుచూస్తున్న మహిళా రైతులు

పెనుకొండ రూరల్: రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన రైతులకు నిరాశ ఎదురైంది. అమరాపురం మండలం హేమావతికి చెందిన మహిళా రైతులు శంకరమ్మ, లక్ష్మక్క, ఆదెమ్మ, లక్ష్మమ్మ, మరికొందరు భూ సమస్యలపై (రికార్డ్ ఆఫ్ రైట్) అధికారులకు విన్నవించేందుకు వచ్చారు. వారు మాట్లాడుతూ అధికారులకు గతంలో సమస్యలను విన్నవించామన్నారు. వాటిని పరిష్కరించేందుకు కార్యాలయ సిబ్బంది శనివారం కార్యాలయానికి రావాలని తెలియజేశారన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చామని, అయితే కార్యాలయం వద్ద ఉదయం నుంచి పడిగాపులు కాస్తున్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు.

మార్కెట్‌లోకి కాలుష్య నియంత్రణ వాహనాలు


హోండా వాహనాన్ని విడుదల చేస్తున్న డీటీసీ కరుణసాగర్ రెడ్డి

హిందూపురం అర్బన్ : మార్కెట్‌లోకి కాలుష్య నియంత్రణ వాహనాలు వచ్చాయని వాటిని కొనుగోలు చేయడం మంచిదని జిల్లా రవాణాశాఖ అధికారి కరుణసాగర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రీమియం హోండా షోరూంలో హోండా ఓబిడి –2బి ద్విచక్ర వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం ఎండీ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో కూడిన బ్లూటూత్, జీపీఎస్ నావిగేషన్, ఎల్ఈడీ హెడ్ లైట్స్ తోపాటు పర్యావరణహితమైన హోండా వాహనాలు మార్కెట్‌లోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో షోరూం మేనేజర్ శ్రీధర్, సబ్ డీలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కస్టమర్లకు డీటీసీ పలు సూచనలు చేశారు.

ప్రజల పక్షాన పోరాడతాం


పార్టీ బలోపేతంపై చర్చిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

మడకశిరరూరల్: సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఏడు నెలలు కావస్తున్నా హామీల అమలుపై స్పష్టత ఇవ్వడం లేదు. హామీల అమలుకు ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తుందని పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప తెలిపారు. శనివారం ఆయన నాయకులతో కలిసి హరేసముద్రం పంచాయతీలో పర్యటించారు. స్థానిక నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పార్టీని మరింత పటిష్టం చేయాలన్నారు. ఇందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ గుర్తించి అండగా నిలుస్తుందన్నారు. ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామస్థాయిలో కార్యకర్తలకు అండగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. 14 ఏళ్ల సీఎంగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఏనాడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన చరిత్ర లేదన్నారు. పెట్టుబడి సాయం అందించకపోవడంతో రబీ పంటల సాగుకు రైతులు అప్పులు చేసే పరిస్థితిని తీసుకోచ్చారన్నారు. తల్లికి వందనపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వకపోవడంతో విద్యార్థుల తల్లులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ఎస్ మూర్తి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు నరసింహమూర్తి, నాయకులు రఘునాథ్,రాజు, రంగనాథ్, జక్కేపల్లి హరిప్రసాద్ తదితర నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కండి


లేపాక్షిలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న సిబ్బంది

అమరాపురం: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయం నుంచి అధికారులు, ప్రజలతో కలసి బస్టాండు వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రమైన వాతావరణంలో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఎక్కడైతే అపరిశుభ్రత ఉంటుందో అక్కడి ప్రజలు అనారోగ్యానికి గురవుతారని పేర్కొన్నారు. ప్రతి నెల మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఏఓ.విశేశ్వరరాధ్య, కార్యదర్శి సుధాకర్, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లేపాక్షి: ప్రజలంతా స్వచ్ఛాంధ్రలో భాగస్వాములు కావాలని అధికారులు కోరారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ కార్యాలయాల వద్ద చెత్తాచెదారాన్ని తొలగించారు. మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్,సర్పంచ్ ఆదినారాయణ, ఎంపీడీఓ నరసింహమూర్తి, ఈఓఆర్డీ ఆనంద్ పాల్గొన్నారు.

రొళ్ల: రత్నగిరి, కాకి పంచాయతీ కేంద్రంలో 'స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, పెనుకొండ డీఎల్‌పీఓ శివసూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టి ప్రతిజ్ఞ చేయించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామరావు, మండల ప్రజా పరిషత్ ఏఓ ప్రసాద్ పాల్గొన్నారు.

అగళి: ప్రజలు, సిబ్బంది భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతం అవుతుందని ఎంపీడీఓ యాదవేంద్ర పేర్కొన్నారు. ప్రతి నెలా మూడవ శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. సర్పంచ్ లక్ష్మమ్మ, ఈఓఆర్డీ పద్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి, పంచాయతీ కార్యదర్శి రంగనాథ్‌పాల్గొన్నారు.

గుడిబండ: మండల కేంద్రంలో సర్పంచ్ కరుణాకర్‌గౌడు, ఎంపీడీఓ నాగరాజు నాయక్ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

'మా పొట్ట.. కొట్టొద్దు'


విలేకరులతో మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణులు

హిందూపురం టౌన్: కార్పొరేట్ సెలూన్ సంస్థలు ఏర్పాటు చేసి తమ పొట్ట కొట్టొద్దని సవిత మహర్షి నాయీ బ్రాహ్మణ సేవా సంక్షేమ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ సెలూన్ సంస్థల ఏర్పాటుతో తమ జీవనం ఇబ్బందికరంగా మారుతుందన్నారు. కార్పొరేట్ సంస్థలను ఏర్పాటు చేయకుండా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 20న పట్టణంలోని నాయి బ్రాహ్మణులు తమ సెలూన్ షాపులను స్వచ్ఛందంగా బంద్ చేసి సీతారామాంజనేయ స్వామి ఆలయం నుంచి నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని కోరారు. సంఘం పట్టణాధ్యక్షుడు మూర్తి, వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు, కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, గౌరవాధ్యక్షుడు డిస్కో నాగరాజ్, సలహాదారులు శ్రీధర్, మంజునాథ్, శివ, మూర్తి, శ్రీరాములు, శ్రీనివాసులు, శివ రాజ్, సందీప్, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనలో ప్రభుత్వం విఫలం

- 'కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్'లో మాజీ మంత్రి ఉషశ్రీచరణ్


కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమంలో పార్టీశ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: ప్రజలకు సంక్షేమాన్ని, అభివృద్ధిని అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైనట్లు మాజీ మంత్రి, సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆరోపించారు. మండలంలోని కొడిగెనహళ్లి మేజర్ పంచాయతీ గ్రామంలో శనివారం ఉదయం కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమం నిర్వహించారు. ఉషశ్రీచరణ్‌కు తొలుత వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం సేవామందిరం సర్కిల్ నుంచి కొడిగెనహళ్లి ఎస్సీ కాలనీ అంబేడ్కర్ నగర్ వరకూ దారి పొడవునా నడుచుకుంటూ ప్రజలను ఆప్యాయంగా గుడ్ మార్నింగ్ అంటూ పలకరిస్తూ ముందుకు సాగారు. కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో భాగంగా పలు ప్రదేశాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి తేనీరు తాగారు. రైతులు, మహిళలు, విద్యార్థులతో, వ్యాపారులతో, దుకాణదారులతో, హోటళ్ల యజమానులతో సాదక బాధకాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రస్తుత ప్రభుత్వం నుంచి ఏదైనా సాయం అందుతుందా? అని ప్రశ్నించారు. కూటమి సర్కార్ ఏర్పడిన నాటి నుంచి నేటికీ సంక్షేమ పథకాలేవీ అందలేదని లబ్ధిదారులు ఉషశ్రీచరణ్‌తో వాపోయారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలెండర్, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు తదితర పథకాలేవీ నేటికీ అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆమెతో వాపోయారు.

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్ద పీట వేశారని ఉషశ్రీచరణ్ అన్నారు. ఏడాది పొడవునా అత్యంత పారదర్శకంగా, అవినీతి అక్రమాలకు తావు లేకుండా, కుల మత రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అయితే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలను చేపట్టాక అటకెక్కించి, ప్రజల ఆకాంక్షలను తుంగలో తొక్కారన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ శ్రేణులను టార్గెట్ చేసి, అక్రమ కేసులు బనాయిస్తే ఊరుకోబోమన్నారు. చట్టపరంగా న్యాయ పోరాటాన్ని చేస్తామని ఉషశ్రీచరణ్ తెలిపారు. రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులు, ఆఖరుకు అభం శుభం తెలియని చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. కానీ ఇవేమీ పట్టనట్లుగా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. నిష్పక్షపాతంగా పాలన సాగించేందుకు అధికార పక్ష ప్రజాప్రతినిధులకు సమయం లేదని, కేవలం దోచుకొని, దాచుకోవడానికి సమయమంతా వెచ్చిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, సర్పంచ్ సాకమ్మ, ఎంపీటీసీ సభ్యులు మారుతీరెడ్డి, చిక్కన్న పాల్గొన్నారు.

ఎల్ఐసీ జాతీయీకరణ లక్ష్యాలను కొనసాగించాలి

హిందూపురం టౌన్: ఎల్ఐసీ జాతీయీకరణ లక్ష్యాలను కొనసాగించాలని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం హిందూపురం బ్రాంచ్ అధ్యక్షురాలు చంద్రకళ, ప్రధాన కార్యదర్శి రమేష్ శనివారం కోరారు. జనవరి 19న ఎల్ఐసీ జాతీయకరణ జరిగి 69 ఏళ్లు పూర్తవుతుందని, 245 ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల మోసాల నుంచి ప్రజలను కాపాడేందుకే వాటి స్థానంలో ఒక ప్రభుత్వ రంగ సంస్థగా ఎల్ఐసీని ఏర్పాటు చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఎల్ఐసీని బలోపేతం చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందరు. ఆరోగ్యం, బీమా ప్రతి భారతీయుడికి కనీస అవసరాలని హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ భారాన్ని తొలగించాలని కోరారు

వ్యక్తిపై రాయితో దాడి

రొళ్ల: మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం సన్నచిక్కన్న అనే వ్యక్తిపై ఉమేష్ అనే వ్యక్తి రాయితో దాడి చేశాడు. బాధితుతు సన్నచిక్కన్న మామ గోవిందప్ప తెలిపిన వివరాలు.. రత్నగిరి గొల్లహట్టికి చెందిన సన్నచిక్కన్న కుటుంబ సభ్యులతో ద్విచక్ర వాహనంలో బంధువుల ఇళ్లకు వెళ్లేందుకు బయలుదేరాడు. పెట్రోల్ వేయించుకునేందుకు బంక్ వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఆర్.వడ్రహట్టికి చెందిన ఉమేష్ బంకు వద్దకు వచ్చి సన్నచిక్కన్నతో దురుసుగా ప్రవర్తించాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరగడంతో ఉమేష్ సహనం కోల్పోయాడు. రాయితో సన్నచిక్కన్న తలపై కొట్టడంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే సన్నచిక్కన్నను రొళ్ల సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై రొళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.అయితే ఉమేష్ మతిస్థిమితం లేకుండా తిరుగుతూ.. మాట్లాడించిన జనాలపై దాడి చేస్తున్నాడని గ్రామస్తుల ద్వారా తెలిసింది.

కర్ణాటక మద్యం స్వాధీనం

గుడిబండ: మండల పరిధిలోని మోపురుగుండు గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన దొడ్డప్ప గారి మాలింగప్ప అనే వ్యక్తి శనివారం అక్రమంగా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రాజుకుల్లాయప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా కోట కొత్తూరు నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం అందినట్లు పేర్కొన్నారు. ఎస్సీ కాలనీలో తనిఖీలు చేసి మాలింగప్పను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. 20 మద్యం ప్యాకెట్లు (90 ఎంఎల్) స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకువచ్చి విక్రయించడం, తరలించడం చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

నేడు 'కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్'

రొద్దం: తురకలాపట్నం గ్రామ పంచాయతీలో ఆదివారం ఉదయం 6 గంటలకు కాఫీ విత్ వైఎస్సార్ సీపీ లీడర్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు సి.నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ హాజరవుతారని ఆయన చెప్పారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని కమిటీల సభ్యులు, నాయకులు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

మడకశిర: 6వ తరగతి ప్రవేశాలకు శనివారం నిర్వహించిన జవహర్ నవోదయ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు మొత్తం 652 మంది విద్యార్థులకు గాను 438 మంది హాజరయ్యారు. 214 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి తెలిపారు.

పరిశుభ్రత పాటించాలి

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని గ్రామ కార్యదర్శి నర్సేగౌడ్ తెలిపారు. శనివారం కదిరేపల్లిలో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత వల్ల కలిగి ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు చేపల చెరువు వేలం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పెద్ద చెరువులో చేపల పెంపకానికి సోమవారం ఉదయం 10:30 గంటలకు గ్రామ సచివాలయంలో సర్పంచ్ కరియన్న సమక్షంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి అశ్వత్థరెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని సూచించారు. ఈ అవకాశాన్ని వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

హిందూపురం అర్బన్: పట్టణంలోని రైల్వే రోడ్డులో విద్యుత్ టవర్ల నిర్మాణ పనులు, 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ అంతరాయం ఉన్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ భూపతి తెలిపారు. రహమత్‌పూర్, నూర్ కాలనీ, సిల్క్ కాలనీ, సీపీఐ కాలనీ, ఆర్టీఓ ఆఫీస్, పాండురంగ నగర్, అంబేద్కర్ నగర్, కోట ఏరియా, మెయిన్ బజార్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వైద్యశిబిరం

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయం వద్ద ఆలయ కమిటి చైర్మన్ కరణం రమానందన్ చొరవతో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రతి శని, ఆదివారాల్లో ఆలయానికి వచ్చే పర్యాటకులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా క్యాంపుకు వచ్చిన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రేపు చింతతోపు వేలం పాట

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు చింతతోపు వేలం పాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పాణీరాజు, సర్పంచ్ శివకుమార్ తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.